# అభివృద్ధిలో బోథ్ ముందంజ..

- పదేండ్లలో గణనీయ మార్పు
- వైద్య, విద్య, రవాణా, సాగునీటి రంగాలకు ఊతం
- గిరిజనాభివృద్ధికి పలు పథకాలు
- ప్రజలకు మెరుగైన సౌకర్యాలు



ముక్రా(కే) గ్రామ పంచాయతీ భవనం

ఇచ్చోడ, నవంబర్ 29 : ఆదిలాబాద్ జిల్లాలో వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతమైన బోథ్ నియోజకవర్గంలో గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి నోచుకోలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో అమలు చేసిన పథకాలు నియోజకవర్గ ప్రజలకు వరంగా మారాయి. వివిధ పథకాల ద్వారా నిధులు కేటాయించడంతో నియోజకవర్గంలో వైద్య, విద్య, సాగునీరు, వ్యవసాయం ఇతర రంగాల్లో అభివృద్ధి సాధించింది. మిషన్ కాకతీయ పథకం ద్వారా సాగునీరు అందిస్తున్నది. గతంలో అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పిస్తుంది.

### పదేళ్లలో చేసిన అభివృద్ధి

❖ దళిత బస్తీ కింద నియోజకవర్గంలోని 9 మండలాల్లో 119 మంది లబ్ధిదారులకు రూ.111.27 కోట్లతో 2557 ఎకరాల భూమి పంపిణీ. అలాగే దళితులకు నియోజకవర్గంలో రూ.10 కోట్లతో 100 మంది లబ్ధిదారులకు వివిధ యూనిట్ల కింద పంపిణీ.

❖ రూ.24 కోట్లతో భీంపూర్, బోథ్, ఇచ్చోడ, సిరికొండ, తలమడుగులో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, హాస్టళ్ల భవనాలు ఏర్పాటు చేశారు.

❖ రూ.8 కోట్లతో మన్నూర్, కజ్జర్ల, నర్సాపూర్, నిపాని, దేగామ, బోథ్‌లో విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు .

❖ రూ.13.50 కోట్లతో బోథ్, ఇచ్చోడ, తలమడుగు, గుడిహత్నూర్‌లో పంటలు నిలువ చేయడానికి గోదాములు నిర్మించారు.

❖ బోథ్ తహసీల్ కార్యాలయం భవనం నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరు చేయడం జరిగింది.

❖ బోథ్ నియోజకవర్గంలో ఐటీడీఏ, ఉపాధి హామీ ద్వారా రూ.22 లక్షల చొప్పున 80 నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం చేపట్టింది.

### పర్యాటక అభివృద్ధికి కృషి

బోథ్ నియోజకవర్గంలో ఆసియా ఖండంలోనే ఎత్తైన జలపాతం కుంటల. అభివృద్ధి కోసం రూ.3 కోట్ల 80 లక్షలు మంజూరు చేసింది. అలాగే నేరడిగొండ నుంచి కుంటల జలపాతానికి రూ.2 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మించింది. రూ.9 కోట్లతో బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద అర్బన్ పార్క్ నిర్మాణం చేపట్టింది. బోథ్ నియోజకవర్గంలో 29.39 కోట్లతో ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, చెరువులు, రూ.368 కోట్లతో పిప్పల్‌కోటి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టింది. రూ.69 కోట్లతో 25 చెక్‌డ్యాంలను ఏర్పాటు చేసింది. 19 నూతన చెరువుల నిర్మాణానికి, కుప్టి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.794.33 కోట్లు మంజూరు చేసింది.

### రహదారులు , వంతెనల నిర్మాణం

రూ.6.52 కోట్లతో బోథ్ నుంచి నిర్మల్ జిల్లా సారంగపూర్ ఆడెల్లి పోచమ్మ ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. వీటి పాటు నియోజకవర్గంలో రూ.42.29 కోట్లతో మారుమూల గిరిజన గ్రామాలకు ప్రభుత్వం బీటీ రోడ్లు, రూ.6.40 కోట్లతో బజార్‌హత్నూర్ మండలం కొల్హారి నుంచి ముర్కండి వంతెన, రూ.18 కోట్లతో జమీందపూర్ నుంచి కరంజి వరకు బీటీ రోడ్డు, రూ.53.68 కోట్లతో నియోజకవర్గంలోని పంచాయతీ ఇంజినీరింగ్ రోడ్ల నిర్మాణం, రూ.7.39 కోట్లతో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో వంతెన నిర్మాణాలు చేపట్టారు. రూ.13 కోట్లు ఇచ్చోడ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేసింది.

### వైద్య సేవలకు పెద్ద పీట

బోథ్‌లో 30 పడకల కమ్యూనిటీ దవాఖాన భవన నిర్మాణానికి రూ.10.50 కోట్లు మంజూర చేయగా పనులు ప్రారంభమయ్యాయి. బోథ్ నియోజకవర్గంలో రూ.144 లక్షలతో తలమడుగు, భీంపూర్, పొచ్చెర, బోరిగామ, తలమద్రి, ఇచ్చోడ, అందూర్, చింతలబోరి, కరత్వాడలో ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నారు.

### బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం

గత ప్రభుత్వాత హయాంలో బోథ్ అభివృద్ధికి నోచుకోలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 9 సంవత్సరాల్లో వైద్య, విద్య, రవాణా, సాగునీరు, వ్యవసాయంతో పాటు ఇతర రంగాల్లో గణనీయంగా అభివృద్ధిలో దూసుకుపోతుంది. ప్రభుత్వం మహిళలకు, వృద్ధులకు, బీడీ కార్మికులకు, దివ్యాంగులకు పింఛన్ అందిస్తోంది. ప్రజల్లోకి వెళ్తే బీఆర్ఎస్‌కు ఓటు వేస్తామని అంటున్నారు. బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ ప్రజలు ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ప్రజలు అంటున్నారు.

- జాదవ్ అనిల్, బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి



కుంటల రోడ్డు

# పోలింగ్ నిర్వహణకు సిద్ధం

- కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- తొమ్మిది మండలాలు 35 రూట్లుగా విభజన
- 302 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 1800 మంది సిబ్బంది నియామకం



బోథ్‌లో పోలింగ్ స్టేషన్ల వివరాలు సరి చూసుకుంటున్న సిబ్బంది

బోథ్, నవంబర్ 29 : బోథ్ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు బుధవారం సిబ్బంది బయలుదేరి వెళ్లారు. రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ పోలింగ్ నిర్వాహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేయించారు. బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, సిరికొండ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాలను 35 రూట్లుగా విభజించారు. మొత్తం 302 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2,08,048 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేలా వీటిని ఏర్పాటు చేయించారు. పీవోలు, ఏపీవోలు, ఓపీవోలను సుమారు 1800ల వరకు (రిజర్వులను కలిపి) నియమించారు. వీరికి బోథ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామగ్రి, ఈవీఎంలు, వీవీపాట్ మిషన్లు అందించారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు, జీపులు తదితర వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు చేరవేశారు. పోలింగ్ సిబ్బందితో పాటు పోలీసులు, హోంగార్డులు విధుల నిర్వహణకు తరలి వెళ్లారు.

### పకడ్బందీగా ఏర్పాట్లు

భీంపూర్, నవంబర్ 29 : భీంపూర్ మండలంలోని 28 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 4 రూట్లలో ఆర్వోలు పెట్రోలింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు పోలింగ్ తీరును తెలుసుకుంటూ ఉన్నతాధికారులకు నివేదిస్తారు.. తహసీల్దార్ నారాయణ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు.

ఇచ్చోడ, నవంబర్ 29 : మండలంలోని గ్రామాల్లో 48 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మహిళలు 17406, పురుషులు 16582 మొత్తం 33989 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. సిరికొండ మండలంలో 19 పోలింగ్ కేంద్రాలు ఉండగా పురుషులు 3373, మహిళలు 3552 మొత్తం 6920 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు తెలిపారు.



బోథ్‌లో ఎన్నికల విధుల కోసం బయలు దేరుతున్న పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు



ఇచ్చోడ : విధులకు హాజరవుతున్న సిబ్బంది

# బందోబస్తు ఏర్పాటు



బోథ్‌లో మహారాష్ట్ర నుంచి వచ్చిన హోంగార్డులకు విధులు కేటాయిస్తున్న ఎస్ఐ నరేశ్

బోథ్, నవంబర్ 29: బోథ్ నియోజకవర్గ పరిధిలో గురువారం నిర్వహించనున్న ఎన్నికల పోలింగ్ కోసం గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి సమయ్‌జాన్‌రావు తెలిపారు. డీఎస్పీతో పాటు తొమ్మిది మండలాలకు ఒకరు చొప్పున తొమ్మిది మంది సీఐలు, 12 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు కానిస్టేబుళ్లు, స్థానిక హోంగార్డులు కలిపి 600ల మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీరితో పాటు మూడు కంపెనీల బీఎస్ఎఫ్ ఫోర్స్ బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన 200ల మంది హోంగార్డులు ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. తొమ్మిది మండలాల పరిధిలోని 302 పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు పోలింగ్ ముగిసే వరకు గట్టిబందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు పోలింగ్‌కు సహకరించాలని కోరారు. బుధవారం స్థానిక సాయి కాన్ఫరెన్స్ హాల్‌లో, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పోలీస్ స్టేషన్లలో అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో బోథ్ సీఐ భీమేశ్, ఎస్ఐలు, రాము, నరేశ్ సిబ్బందికి విధులు కేటాయించారు.

### పోలింగ్ నిర్వహణకు చర్యలు

తాంసి(తలమడుగు), నవంబర్ 29 : పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ ధనశ్రీ అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

### బోథ్ నియోజకవర్గంలో 2,08,048 మంది ఓటర్లు

బోథ్, నవంబర్ 29: బోథ్ నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది మండలాల్లో 2,08,048 మంది ఓటర్లున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. వీరిలో 1,01,281 మంది పురుషులు, 1,06,674 మంది మహిళలు ఉన్నట్లు పేర్కొన్నారు. వీరి కోసం 302 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్వో తెలిపారు. భీంపూర్ మండలంలో 18,932 మంది ఓటర్ల కోసం 28 పోలింగ్ కేంద్రాలు, తాంసిలో 13,525కు గాను 17, తలమడుగులో 27,003కు గాను 43, గుడిహత్నూర్‌లో 24,379కి గాను 36, ఇచ్చోడలో 33,989కు గాను 48, సిరికొండలో 6,925కు గాను 9, బజార్‌హత్నూర్‌లో 23,178కి గాను 37, బోథ్‌లో 37,015కి గాను 49, నేరడిగొండలో 23,102కు గాను 35 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ నగేశ్

తాంసి, నవంబర్ 29 : మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన గిజ్జ గంగయ్య ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎంపీ నగేశ్ పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కేమ సదానందం, సర్పంచ్ బొల్లి సౌందర్య, కేమ గంగయ్య, గంగాధర్, గణపతి, ఉప సర్పంచ్ పైమీర్, కుమారస్వామి ఉన్నారు.